## పారమితలో అవార్డుల ప్రదానోత్సవం




విద్యార్థినులకు అవార్డులు ప్రదానం చేస్తున్న అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్

కమాన్‌చౌరస్తా, నవంబర్ 27: జిల్లా కేంద్రంలోని పద్మనగర్ పారమిత హెరిటేజ్ పాఠశాలలో 2023-24 విద్యాసంవత్సరంలో అత్యంత ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్ ఆధారిత అభ్యాస ప్రదర్శన ఇంటర్ పీబీఎల్ ముగింపు వేడుకలు అట్టహాసంగా సాగాయి. కార్యక్రమానికి అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ ముఖ్య అతిథిగా హాజరై, ప్రాజెక్టులను పరిశీలించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు అవార్డులు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ప్రసాద రావు, విద్యాసంస్థల డైరెక్టర్లు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలతో అనర్థాలు

కలెక్టరేట్, నవంబర్ 27 : బాల్య వివాహాలతో కలిగే అనర్థాలపై బాలల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈకార్యక్రమంలో డీసీపీవో పర్వీన్ పాల్గొని మాట్లాడుతూ, బాల్య వివాహ నిరోధక చట్టం ద్వారా బాలల హక్కులు కాపాడవచ్చన్నారు. చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 జిల్లా కో ఆర్డినేటర్ ఆవుల సంపత్ మాట్లాడుతూ, అబ్బాయికి 21 ఏళ్లు, అమ్మాయికి 18 ఏళ్లు నిండిన అనంతరమే వివాహం చేయాలన్నారు. ఈలోపు చేసినట్లయితే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ఆవివాహం కూడా చెల్లదని, బాల్య వివాహాలపై ఫిర్యాదుల కోసం చైల్డ్‌లైన్ 1098/ 9490881098 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో యూనిసెఫ్ కో ఆర్డినేటర్ కిషన్‌స్వామి, డీఆర్‌డీవో రమేశ్, కళ్యాణి, హాస్టల్ వెల్ఫేర్ అధికారి, విద్యార్థులు పాల్గొన్నారు.

## నిలిచిపోయిన రిజిస్ట్రేషన్ సేవలు

గంగాధర, నవంబర్ 27: గంగాధర సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో బుధవారం రిజిస్ట్రేషన్ సేవలు నిలిచి పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఉదయం 10 గంటల సమయంలో సర్వర్‌లో సాంకేతిక సమస్య రావడంతో రిజిస్ట్రేషన్ సేవలకు అంతరాయం ఏర్పడింది. సాయంత్రం వరకు కూడా సమస్యకు పరిష్కారం కాకపోవడంతో రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన వారు నిరాశగా వెనుదిరిగారు. సుదూర ప్రాంతాలను నుంచి రిజిస్ట్రేషన్ కోసం వచ్చామని, ఆన్‌లైన్ సమస్యతో రిజిస్ట్రేషన్లు చేయడం లేదని సిబ్బంది చెప్పడంతో తీవ్ర నిరాశ చెందినట్లు తెలిపారు.

## సహకార సంఘం ద్వారా రైతులకు మరిన్ని సేవలు



గునుకులపల్లెలో బైక్‌లో పెట్రోల్ పోసి బంకును ప్రారంభిస్తున్న సింగిల్ విండో చైర్మన్ వెంకటరమణారెడ్డి

చిగురుమామిడి, నవంబర్ 27: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ద్వారా రైతులకు మరిన్ని సేవలను అందించేందుకు కృషి చేస్తామని సింగిల్ విండో చైర్మన్ జంగా వెంకటరమణారెడ్డి అన్నారు. మండలంలోని గునుకులపల్లె గ్రామంలో డీజిల్, పెట్రోల్ బంకును బుధవారం పాలకవర్గ సభ్యులతో కలిసి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ, అనతి కాలంలోనే సహకార సంఘం ద్వారా రైతులకు అనేక సదుపాయాలను ఏర్పాటు చేశామన్నారు. రాబోయే రోజుల్లో రైతులకు మరిన్ని ప్రయోజనాలు చేకూరేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సీఈవో నర్సయ్య, సేల్స్ మేనేజర్ శరంజిత్, పాలకవర్గ సభ్యులు అందే చిన్నస్వామి, ముద్రకోల రాజయ్య, చాడ శ్రీధర్ రెడ్డి, తిరుపతి గౌడ్, రవీందర్ రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి బాక్సింగ్ పోటీలకు అల్ఫోర్స్ విద్యార్థి

కొత్తపల్లి, నవంబర్ 27 : జాతీయస్థాయి బాక్సింగ్ పోటీలకు అల్ఫోర్స్ విద్యార్థి తిట్ల అమన్ అర్షిత్ ఎంపికయ్యాడు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం సీఈసీ చదువుతున్న అతడు, ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన అండర్-19 బాక్సింగ్ పోటీల్లో 69-75 కిలోల విభాగంలో బంగారు పతకం సాధించి జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. అర్షిత్‌ను అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డా. వీ నరేందర్‌రెడ్డి, జీఎస్ అకాడమీ నిర్వాహకులు, తోటి విద్యార్థులు అభినందించారు.

## జాతీయ వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ట్రినిటి కళాశాల విద్యార్థిని

కొత్తపల్లి, నవంబర్ 27 : జాతీయస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ట్రినిటి జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థిని షేక్ అఫాన్ ఎంపికైంది. ఇటీవల రంగారెడ్డి జిల్లాలోని జింఖానా మైదానంలో జరిగిన అండర్-19 రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొన్న షేక్ అఫాన్, అద్భుత ప్రతిభ చూపి బంగారు పతకం సాధించి జాతీయ పోటీలకు ఎంపికై సత్తా చాటింది. బుధవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థినిని వ్యవస్థాపకుడు దాసరి మనోహర్‌రెడ్డి, చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి అభినందించారు.

## మరమ్మతు చేస్తుండగా హార్వెస్టర్‌కు మంటలు

హుజూరాబాద్ టౌన్, నవంబర్ 27: పట్టణంలోని వరంగల్ రోడ్డులో గల ఓ మెకానిక్ షాప్‌లో పెను ప్రమాదం తప్పింది. చిన్నపాపయ్యపల్లె గ్రామం కోమల్ రెడ్డికి చెందిన హార్వెస్టర్ రిపేర్ చేస్తుండగా, ప్రమాదవశాత్తు మంటలంటుకున్నాయి. స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వగా.. ఫైర్ సిబ్బంది బీ శ్రీనివాస్, ఈ ప్రభాకర్, ఎం శ్రీనివాస్, సందీప్ ఘటనా స్థలానికి చేరుకొని మంటలు ఆర్పారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

## కరెంటు తీగలు అంటుకొని గడ్డి దగ్ధం

మానకొండూర్ రూరల్, నవంబర్ 27: ఎరడపల్లికి చెందిన జినుక రాజయ్య గంగిపల్లి మీదుగా చింతకుంటకు వరి ట్రాక్టర్‌లో గడ్డి కట్టలను తీసుకెళ్తుండగా, గంగిపల్లి గ్రామ పంచాయతీ సమీపంలో కరెంటు తీగలు తగలడంతో మంటలు చెలరేగాయి. ట్రాక్టర్‌లో తీసుకెళ్తున్న గడ్డి కట్టలు అంటుకోగా, స్థానికులు, ట్రాక్టర్ డ్రైవర్ అప్రమత్తమై వాటిని ట్రాలీ నుంచి కింద వేయడంతో పెను ప్రమాదం తప్పింది.

## సరస్వతీ శిశు మందిర్‌లో 'కుటుంబ ప్రబోధన్'

కమాన్‌చౌరస్తా, నవంబర్ 27: నగరంలోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ హైస్కూల్‌లో బుధవారం 'కుటుంబ ప్రబోధన్' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని శ్రీ సరస్వతీ విద్యాపీఠం పాలక మండలి సభ్యుడు ఎలగందుల సత్యనారాయణ ప్రారంభించగా, అఖిల భారతీయ శిక్షా సంస్థాన్ ప్రచార విభాగ్ ప్రహరీ లింగం సుధాకర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. స్వదేశీ ఆలోచనలను జోడించుకొని అందరం దేశం కోసం, ధర్మం కోసం పాటుపడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బల్మూరి కరుణాకర్ రావు, మేచినేని దేవేందర్ రావు, కాటం రవీందర్, కోల అన్నారెడ్డి, కొండా గంగాధర్, కొలుగూరి సదాశివరెడ్డి, రాపర్తి శ్రీనివాస్, రాజిరెడ్డి, సముద్రాల రాజమౌళి పాల్గొన్నారు.

## కుట్టు శిక్షణ కేంద్రం సందర్శన

గంగాధర, నవంబర్ 27: ఫాతిమానగర్ అడోరేషన్ సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని కాచిరెడ్డిపల్లి ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని స్పెయిన్ దేశానికి చెందిన మానస్ యునిదాస్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు రోషియో, ఆల్బర్ట్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా మహిళలతో కలిసి బతుకమ్మ, కోలాటం ఆడారు. గ్రామీణ ప్రాంత మహిళలు ఆర్థికంగా అభివృద్ధిని సాధించడానికి సంస్థ ఆధ్వర్యంలో వృత్తి విద్యలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన చేతి పంపును ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జోగు లక్ష్మీరాజం, సంస్థ ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.



కాచిరెడ్డిపల్లిలో ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని సందర్శించిన రోషియో, ఆల్బర్ట్

# ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలి

- పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి
- వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం



మాట్లాడుతున్న సీపీ, పక్కన నగర కమిషనర్

రాంనగర్, నవంబర్ 27: నగరంలో ట్రాఫిక్ నియంత్రణ, ఇతర సమస్యల పరిష్కారానికి అన్ని శాఖల అధికారులు సహకరించాలని పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి సూచించారు. కమిషనరేట్ కేంద్రంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం వివిధ శాఖల అధికారులతో ట్రాఫిక్ నియంత్రణ, రోడ్డు భద్రతా, స్మార్ట్ సిటీ అభివృద్ధిలో భాగంగా సీసీ కెమెరాల ఏర్పాటు, వాటి పనితీరు, కూడళ్ల వద్ద సిగ్నల్స్ ఏర్పాటు కోసం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్.. ట్రాఫిక్ నియంత్రణ, రోడ్డు భద్రతా పరంగా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. శాఖల వారీగా పెండింగ్ పనులు పూర్తి చేయాలన్నారు. అన్నిశాఖలు సమన్వయంతో పనిచేసి ట్రాఫిక్ సమస్య నియంత్రించేందుకు సహకరించాలని కోరారు. కరీంనగర్‌లోని ప్రధాన కూడళ్ల వద్ద సిగ్నల్ వ్యవస్థను మరింత మెరుగుపరచాలన్నారు. సీసీ కెమెరాల సంఖ్యను పెంచి, వాటి పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. యూటర్న్‌ల వద్ద బ్లింకింగ్ సోలార్ లైట్స్ ఏర్పాటు చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు బైపాస్ రోడ్డు మొత్తం లైటింగ్ ఉండేలా చూడాలన్నారు. ఫుట్‌పాత్‌ల ఆక్రమణ తొలగింపు, పార్కింగ్ స్థలాలను గుర్తించి కేటాయించడం, కూరగాయలు, పండ్ల మార్కెట్‌ను వేరే చోటుకు మార్చడం, యూటర్న్‌ల ఏర్పాటు, అవసరమైన చోట్ల జీబ్రా లైన్స్, స్టాప్ మార్కింగ్స్ ఏర్పాటు వంటి చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌ను కోరారు. రోడ్డు మరమ్మతులు, అవసరమైన చోట యూటర్న్‌ల ఏర్పాటు, అలాగే అవసరమైన చోట రోడ్డు మధ్యలో గల డివైడర్‌ని తొలగించడం వంటి పనులు పూర్తి చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులను కోరారు. స్థానిక బస్టాండ్ ఇన్ గేట్ వద్ద గల కార్గో ఆఫీస్ వల్ల వాహనాలు అధిక సంఖ్యలో ఆగి ట్రాఫిక్ సమస్య ఏర్పడుతున్నందున ఆఫీసును బస్టాండ్ ఆవరణలో రోడ్డుకు కొంత లోపల వైపు ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని, బస్ స్టాండ్‌లో సీసీ కెమెరాల సంఖ్యను పెంచడంతోపాటు వాటి పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆర్టీసీ అధికారులను కోరారు. కార్యక్రమంలో బల్దియా కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్‌తో పాటు ఏసీపీలు, మున్సిపల్, ఆర్టీసీ అధికారులు, స్మార్ట్ సిటీ అభివృద్ధి సంస్థ ప్రతినిధి, ఆర్‌అండ్‌బీ, ట్రాన్స్‌పోర్ట్ శాఖ, హెచ్‌కేఆర్, స్మార్ట్ సిటీకి చెందిన ఎంఎస్ఐ సంస్థల అధికారులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఎంఈవోలు రోజుకో పాఠశాల సందర్శించాలి

- విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేయాలి
- కలెక్టర్ పమేలా సత్పతి



మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

కమాన్‌చౌరస్తా, నవంబర్ 27 : మండలంలోని ఎంఈవోలు రోజుకో పాఠశాల సందర్శిస్తూ, విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. తన క్యాంప్ కార్యాలయంలో బుధవారం జిల్లాలోని అన్ని మండలాల ఎంఈవోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండేటప్పుడు కార్మికులు అన్ని జాగ్రత్తలు తీసుకునేలా చూడాలన్నారు. సరుకుల నిల్వ గది, రికార్డులు పరిశీలించి నాణ్యత పాటిస్తున్నారో లేదో చూడాలని చెప్పారు. విద్యార్థులతో మధ్యాహ్నం భోజనం చేసి ఏవైనా సమస్యలుంటే తెలుసుకోవాలన్నారు. వీలైతే విద్యార్థుల తల్లిదండ్రులను కూడా పాఠశాలకు రప్పించి వారి సమక్షంలో భోజనం చేయాలన్నారు. విద్యార్థులు మత్తు పదార్థాలు వినియోగించినా, ఈవ్ టీజింగ్‌కు పాల్పడినా కఠినంగా వ్యవహరించాలని, వారికి సెల్ ఫోన్ అనుమతించొద్దని సూచించారు. వసతి గృహాల నిర్వహణపై కూడా శ్రద్ధ వహించాలని, ఏవైనా సమస్యలు ఉంటే తనను సంప్రదించాలని చెప్పారు. డీఈవో జనార్దన్ రావు, వివిధ మండలాల ఎంఈవోలు పాల్గొన్నారు.

## అయ్యప్ప ఆలయంలో అన్నదానం

కమాన్‌చౌరస్తా, నవంబర్ 27 : జిల్లా కేంద్రంలోని భగత్‌నగర్ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి దేవస్థానంలో బుధవారం జ్యోతిష్మతి విద్యాసంస్థల చైర్మన్ విజయ, సాగర్ రావు దంపతులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు దేవాలయ కార్యనిర్వహణ అధికారి కే కాంతారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో దాదాపు 500 వందల మంది స్వాములు పాల్గొని భిక్ష స్వీకరించారన్నారు. ఇక్కడ అర్చకులు, గురుస్వాములు పాల్గొన్నారు.



స్వాములకు అన్నం వడ్డిస్తున్న సాగర్ రావు

## గల్ఫ్ కార్మిక కుటుంబాలకు సర్కారు అండ: ఎమ్మెల్యే

గంగాధర, నవంబర్ 27 : రాష్ట్రంలోని గల్ఫ్ కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మండలంలోని ఉప్పరమల్యాల గ్రామానికి చెందిన సందరగిరి రమేశ్ ఉపాధి కోసం గల్ఫ్‌కు వెళ్లి గుండెపోటుతో అక్కడే మృతి చెందగా, భార్య, ఇద్దరు పిల్లలు దిక్కులేని వారయ్యారు. వీరి కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న ఎమ్మెల్యే సత్యం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి రూ.5 లక్షల పరిహారం మంజూరు చేయించారు. బుధవారం కరీంనగర్‌లోని ఆయన నివాసంలో బాధిత కుటుంబ సభ్యులు మంజూరు పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు పురుమల్ల మనోహర్, నాయకులు కర్ర కార్తీక్‌రెడ్డి, దోర్నాల శ్రీనివాస్‌రెడ్డి, మహేశ్, వినోద్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత శిక్షణకు దరఖాస్తులు

తిమ్మాపూర్, నవంబర్27: మండల కేంద్రంలోని ఎస్బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో డిసెంబర్ 9 నుంచి 30 రోజులపాటు నిర్వహించనున్న ఫొటోగ్రఫీ అండ్ వీడియోగ్రఫీ ఉచిత శిక్షణలకు గ్రామీణ ప్రాంతాలకు చెందిన పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని డైరెక్టర్ సంపత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాకు చెందిన 18 నుంచి 45 సంవత్సరాల్లోపు అభ్యర్థులు పదో తరగతి మెమో, తెల్ల రేషన్ కార్డు, ఆధార్ కార్డు జిరాక్స్‌లతో సంస్థలో సంప్రదించాలని పేర్కొన్నారు.. మరిన్ని వివరాలకు 9884941102 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

## ప్రజా సంఘాల మండల కన్వీనర్‌గా మాతంగి శంకర్

తిమ్మాపూర్, నవంబర్ 27: ప్రజాసంఘాల సమన్వయ కమిటీ మండల కన్వీనర్‌గా మాతంగి శంకర్‌ను నాయకులు ఎన్నుకున్నారు. పేద మధ్యతరగతి ప్రజల సమస్యలను అధ్యయనం చేసి వాటి పరిష్కారం కోసం ప్రజా సంఘాల కమిటీ పనిచేస్తుందని శంకర్ తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## రాంపూర్ హనుమాన్ ఆలయంలో చోరీ

రాంనగర్, నవంబర్ 27: నగరంలోని కోతి రాంపురంలో హైదరాబాద్ రహదారి ఆనుకొని ఉన్న హనుమాన్ ఆలయంలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. పోలీసు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమాన్ ఆలయంలో మంగళవారం యథావిధిగా పూజల అనంతరం అర్చకుడు తాళం వేసి ఇంటికి వెళ్లాడు. బుధవారం ఉదయం రాగ తాళం పగలగొట్టి ఉండడంతో అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం అందించాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు చోరీ జరిగిందని గుర్తించి, ఆధారాల కోసం ప్రయత్నించారు. ఆలయంలోని నాలుగు పంచ లోహ విగ్రహాలు, వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు అర్చకుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ కోటేశ్వర్ తెలిపారు.

## మురుగు కాల్వలో పడి ఒకరి మృతి

శంకరపట్నం, నవంబర్ 27: మండలంలోని కేశవపట్నంలో ఊకంటి పరబ్రహ్మం (55) అనే వ్యక్తి కాల్వలో పడి మృతి చెందిన విషాదకర ఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పరబ్రహ్మంకు భార్యా పిల్లలు లేరు. దేవాలయాలు, బంధువులు, తదితర ఇండ్లలో పెట్టింది తిని జీవిస్తున్నాడు. బుధవారం ఉదయం కాల్వలో పడి ఉన్న మృతదేహాన్ని చూసి పరబ్రహంగా గుర్తించారు. మంగళవారం రాత్రి ప్రమాదవశాత్తు మురుగు కాల్వలో పడి మృతి చెందినట్లు ఉంటాడని గ్రామస్తులు భావిస్తున్నారు. బంధువులు అంత్యక్రియలు నిర్వహించారు.

## పోగొట్టుకున్న బ్యాగు అందజేత



పది తులాల నగలు ఉన్న బ్యాగును మహిళకు అందజేస్తున్న ఎస్ఐ నరేందర్‌రెడ్డి

గంగాధర, నవంబర్ 27: లక్ష్మీదేవిపల్లి గ్రామానికి చెందిన హీనాపర్వీన్ బుధవారం సాయంత్రం తన తల్లితో కలిసి కరీంనగర్‌లో ఆటో ఎక్కి గ్రామంలో దిగింది. కొద్ది సేపటి తర్వాత తన బ్యాగు లేకపోవడం గమనించి గంగాధర పోలీస్ స్టేషన్‌కు వచ్చి పోలీసులకు తెలిపింది. ఎస్ఐ నరేందర్‌రెడ్డి, పోలీసులు ఆటోను ట్రేస్ చేసి వేములవాడ వద్ద పట్టుకుని అందులో ఉన్న బ్యాగును స్వాధీనం చేసుకున్నారు. బ్యాగులో 10 తులాల బంగారు నగలు, మొబైల్ ఫోన్ ఉండగా, దానిని గంగాధర పోలీస్ స్టేషన్‌లో హీనాపర్వీన్‌కు అందజేశారు. సకాలంలో స్పందించి పోగొట్టుకున్న బ్యాగును తిరిగి అందజేసిన పోలీసులకు ఆమె కృతజ్ఞతలు తెలిపింది. కాగా, పోగొట్టుకున్న బ్యాగును పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన హెడ్ కానిస్టేబుల్స్ రాజయ్య, కృష్ణారెడ్డి, ఐటీసెల్ పీసీ ప్రదీప్‌ను ఎస్ఐ నరేందర్‌రెడ్డి అభినందించారు.

## ప్రజా సమస్యలపై పోరాటాలు ఉధృతం చేస్తాం

తిమ్మాపూర్, నవంబర్ 27: ప్రజల సమస్యల పరిష్కారానికి భవిష్యత్తులో పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సుంకరి సంపత్ తెలిపారు. బుధవారం ఆయన ఎల్ఎండీలో విలేకరులతో మాట్లాడుతూ, కరీంనగర్‌లో ఈనెల 29 నుంచి రెండు రోజులపాటు జరుగనున్న సీపీఎం పార్టీ పదో జిల్లా మహాసభలు జయప్రదం చేయాలని కోరారు. కార్మికులు, రైతులు, కూలీలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

## విద్యార్థినులకు అవగాహన

కమాన్‌చౌరస్తా, నవంబర్ 27 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఉమెన్ ఎంపవర్‌మెంట్ హెల్త్ క్లబ్ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక ఆటమ్ హాస్పిటల్ నుంచి వైద్యురాలు శ్రీజ బద్దం హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు రుతుక్రమంలో వచ్చే సమస్యలు, పాటించాల్సిన వ్యక్తిగత శుభ్రతకు సంబంధించిన విషయాలను కూలంకషంగా వివరించారు. పీసీవోడీ సమస్య గురించి కూడా విద్యార్థినులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ బీ రజినీ దేవి, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డీ వరలక్ష్మి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం కల్పన, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గంగాధర, నవంబర్ 27: గంగాధర విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఏబీ స్విచ్ ఏర్పాటు చేస్తుండడంతో పాటు, బూరుగుపల్లి, నర్సింహుపల్లి, ర్యాలపల్లి సబ్ స్టేషన్లకు వచ్చే 33 కేవీ లైన్ మరమ్మతుల కారణంగా గురువారం ఆయా సబ్ స్టేషన్ల పరిధిలో సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ తిరుపతి బుధవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరా ఉండదని, ఆయా గ్రామాల వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

## సీఈఐఆర్ ద్వారా మొబైల్ ఫోన్ల రికవరీ

రాంనగర్, నవంబర్ 27: సీఈఐఆర్ పోర్టల్‌ను ఉపయోగించి పోగొట్టుకున్న 162 మొబైల్ ఫోన్స్‌ను గుర్తించి, బాధితులకు అప్పగించామని కరీంనగర్ సీసీఎస్ ఏసీపీ కాశయ్య ఒక ప్రకటనలో తెలిపారు. 2023 ఏప్రిల్‌లో ఈ సాంకేతికత వాడుకలోకి రాగా, ఇప్పటివరకు కరీంనగర్ కమిషనరేట్ వ్యాప్తంగా పోగొట్టుకున్న 1206 మంది మొబైల్ ఫోన్స్‌ను గుర్తించి బాధ్యులకు అప్పగించినట్లు వెల్లడించారు. సెల్‌ఫోన్స్‌ను కనిపెట్టేందుకు కృషి చేసిన అధికారులు, సిబ్బందిని సీపీ అభిషేక్ మొహంతి అభినందించారు. ఈ కార్యక్రమంలో సైబర్ క్రైమ్ సెల్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ రమేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

హుజూరాబాద్ టౌన్, నవంబర్ 27: సీఈఐఆర్ పోర్టల్‌ను ఉపయోగించి బాధితులు పోగొట్టుకున్న 50 ఫోన్లను రికవరీ చేసినట్లు హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్ జీ తెలిపారు. పట్టణంలోని ఏసీపీ కార్యాలయంలో బుధవారం సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు తిరిగి అందించారు. కార్యక్రమంలో హుజూరాబాద్ సీఐలు తిరుమల గౌడ్, పులి వెంకట్ గౌడ్, జమ్మికుంట సీఐలు రవి, కిశోర్, ఎస్ఐలు తిరుపతి, ఎన్ రాజకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

రామడుగు, నవంబర్ 27 : మండల కేంద్రానికి చెందిన గంటె మునీందర్, పందికుంటపల్లి గ్రామానికి చెందిన బండ్ల రాంచరణ్ ఇటీవల మొబైల్ ఫోన్స్ పోగొట్టుకోగా, ఎస్ఐ శేఖర్ సీఈఐఆర్ పోర్టల్ ద్వారా రికవరీ చేసి బుధవారం తిరిగి అందించారు. తక్కువ సమయంలోనే ఫోన్లను రికవరీ చేయడంలో ప్రతిభ చూపిన హెడ్‌కానిస్టేబుల్ భూమయ్యను ఎస్ఐ అభినందించారు.

## కేజీబీవీల్లో పోస్టుల భర్తీ

కమాన్‌చౌరస్తా, నవంబర్ 27 : జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న టీచింగ్ పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి జనార్దన్ రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో భాగంగా జిల్లాలో ఏడుగురు అభ్యర్థులను ఎంపిక చేసి, డీఎండబ్ల్యూవో పవన్ కుమార్ ఆధ్వర్యంలో నియామక ఉత్తర్వులు అందజేసినట్లు తెలిపారు.

## నీలి రంగు పక్షి గుడ్లు!



మంగపేటలో కనిపించిన బ్లూ కలర్ పక్షి గుడ్లు

గంగాధర, నవంబర్ 27: మామూలుగా పక్షి గుడ్లు తెలుపు, గోధుమ రంగులో ఉంటాయి. కానీ, మండలంలోని మంగపేట గ్రామానికి చెందిన నాగెల్లి కమలాకర్‌రెడ్డి వ్యవసాయ పొలంలో ఓ చెట్టుపై ఉన్న గూటిలో మూడు బ్లూ కలర్‌లో ఉన్న పక్షి గుడ్లు కనిపించాయి. ఇవి ఏ పక్షికి సంబంధించినవో తెలియదని, ఇంతకు ముందు బ్లూ కలర్ రంగు గుడ్లను ఎప్పుడూ చూడలేదని రైతు కమలాకర్‌రెడ్డి తెలిపాడు.

## విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి



ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో భోజనాన్ని పరిశీలిస్తున్న ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, కమిషనర్ సమ్మయ్య

హుజూరాబాద్ టౌన్, నవంబర్ 27: రాష్ట్ర వ్యాప్తంగా మధ్యాహ్న భోజనంతో విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారని, వారికి నాణ్యమైన ఆహారం అందించకపోతే ఆందోళన తప్పదని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి బండ శ్రీనివాస్ హెచ్చరించారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలుతీరును ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వారం రోజుల నుంచి గురుకులాలతో పాటు పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంతో చాలా మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని తెలిపారు. రెండు రోజుల క్రితం జమ్మికుంట కస్తూర్బా పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న నిత్యశ్రీ అనే పాఠశాల నిర్లక్ష్యంతోనే మరణించిందని, ఇది ప్రభుత్వ హత్యేనని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే అన్ని ప్రభుత్వ విద్యాసంస్థలపై నివేదిక తీసుకొని, వెంటనే నాణ్యమైన భోజనాన్ని అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలి



నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న మాదిగ ఐక్య వేదిక నాయకులు

తెలంగాణచౌక్, నవంబర్ 27: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలనే డిమాండ్‌తో మాదిగల ఐక్య వేదిక నాయకులు బుధవారం నగరంలో ర్యాలీ తీశారు. దుర్గమ్మ గడ్డ అంబేద్కర్ కమ్యూనిటీ భవనం నుంచి కోర్టు చౌరస్తాలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా ఐక్యవేదిక నాయకులు సముద్రాల అజయ్, సుధాకర్, అంజయ్య, మాజీ జడ్పీటీసీ స్వరూప మాట్లాడుతూ, సుప్రీం కోర్టు తీర్పును రాష్ట్రంలో అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ సాక్షిగా ఇచ్చి మాటకు కట్టుబడి ఉండాలని డిమాండ్ చేశారు. వర్గీకరణ అమలు చేసిన తర్వాతనే అన్ని శాఖల్లో ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. వర్గీకరణ అమలు ఆలస్యం చేస్తే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం తప్పదని హెచ్చరించారు.

## మధ్యాహ్న భోజన నిర్వాహకురాలిపై విచారణ

జమ్మికుంట, నవంబర్ 27: మండలంలోని కోరపల్లి ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన నిర్వాహకురాలిపై అధికారులకు పలు ఫిర్యాదులు రాగా, ఎంపీడీవో భీమేశ్, ఏపీఎం శ్రీనివాస్(సెర్ప్) విచారణ చేశారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారులతో మాట్లాడారు. నివేదిక తయారు చేశారు. అనంతరం అభియోగాలపై నిర్వాహకురాలిని వివరణ కోరారు. వేరే వాళ్లు వంటలు చేయడం.. చేసిన వంటలను నాణ్యతా ప్రమాణాల ప్రకారం లేకపోవడాన్ని ప్రశ్నించారు. ఆరోగ్యం బాగా లేనందు వల్ల కుటుంబ సభ్యులతో వంట చేయించానని నిర్వాహకురాలు తెలిపింది. అలాగే, నాసిరకంగా వండడం లేదని చెప్పింది. దీనిపై గ్రామ సంఘం నిర్ణయం తీసుకోవాలని అధికారులు సూచించారు. అలాగే, వారం పాటు మధ్యాహ్నం భోజనం.. పని తీరును పరిశీలించాలని అధికారులు చెప్పారు. నిర్వాహకురాలి వద్ద మార్పు లేకుంటే.. వెంటనే గ్రామ సంఘం తీర్మానంతో మరో సంఘానికి బాధ్యతలు అప్పగించాలని తెలిపారు. ఇక్కడ ప్రధానోపాధ్యాయుడు, జీపీ ప్రత్యేకాధికారి(ఎంపీవో), పంచాయతీ సెక్రటరీ, గ్రామ సంఘం అధ్యక్షురాలు, వీవోఏ, తదితరులున్నారు.

## లోక మాత అహిల్యాబాయి హోల్కర్ పుస్తక ఆవిష్కరణ

కమాన్‌చౌరస్తా, నవంబర్ 27 : భారత రాజ్యాంగ దినోత్సవం, అహిల్యా బాయి హోల్కర్ 300వ జయంతి ఉత్సవాల సందర్భంగా సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో ఆమె జీవిత చరిత్ర పుస్తకాన్ని బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అఖిల భారత సమరసత కళా విభాగం కన్వీనర్ అప్పాల ప్రసాద్ మాట్లాడుతూ, భారత రాజ్యాంగ నిర్మాణంలో 15 మందికి పైగా మహిళలు ప్రధాన పాత్ర పోషించారని, చిత్తు ప్రతిని తయారు చేయడంలో బీఎన్ నర్సింగ రావు, డాక్టర్ రాజేంద్ర ప్రసాద్, సర్దార్ వల్లభభాయ్ పటేల్ కృషితో పాటు డ్రాఫ్టింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చేసిన ప్రయత్నం వల్ల అందరికీ ఆమోద యోగ్యమైన రాజ్యాంగం లభించిందన్నారు. భర్తను కోల్పోయిన అహిల్యాబాయి హోల్కర్ ఆ రోజుల్లోనే మహిళా సాధికారత కోసం కృషి చేసిన ధీర వనితగా, నేటి తరానికి పరిచయం చేయాల్సిన కర్తవ్యం మనపై ఉన్నదని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సమరసత వేదిక కార్యదర్శి రామారావు రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రమేశ్ రెడ్డి, మహిళా విభాగం కన్వీనర్ వినోద, కో కన్వీనర్ జిల్లా ప్రధాన కార్యదర్శి దావు సంతోష్, నర్సింగ్, జిల్లా కన్వీనర్ పురుషోత్తం, కో కన్వీనర్ జగన్, ఉపాధ్యక్షుడు మధుసూదన్ రావు తదితరులు పాల్గొన్నారు.

## వెల్ది పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్

మానకొండూర్ రూరల్, నవంబర్ 27: మండలంలోని వెల్ది జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయుడు రాపెల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వివిధ రకాల వంటకాలు, ఆహార పదార్థాలను విద్యార్థులు తల్లి దండ్రుల సహాయంతో తయారు చేసుకొని తీసుకువచ్చి ప్రదర్శించారు. ఉపాధ్యాయులు, అతిథులు వంటకాల రుచులను చూసి, విద్యార్థులను అభినందించారు. అనంతరం స్థానిక పల్లె ప్రకృతి వనంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి వనభోజనంలో భాగంగా క్షేత్ర పర్యటనకు వెళ్లారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

## సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

శంకరపట్నం, నవంబర్ 27: సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ నాయకుడు ఏంఏ ఖాద్రీ, బోడ శ్రీనివాస్, ఎండీ అలీం, ఎల్ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. యూటీఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త ఉద్యమంలో భాగంగా మండల కేంద్రంలోని కేజీబీవీలో భోజన విరామ సమయంలో సీఆర్టీలు, పీజీ సీఆర్టీలు, యూటీఎఫ్ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కేజీబీవీల్లో ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతం కల్పించాలన్నారు. అన్ని కేజీబీవీల్లో చిల్డ్రన్ కేర్ టేకర్‌లను నియమించాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో పలువురు యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

## 'రోటి కపడా రొమాన్స్' సినిమా యూనిట్ సందడి

కమాన్‌చౌరస్తా, నవంబర్ 27 : జిల్లా కేంద్రంలో 'రోటి కపడా రొమాన్స్' సినిమా యూనిట్ సభ్యులు సందడి చేశారు. ఇందులో భాగంగా పలు కళాశాలలను వారు సందర్శించి, విద్యార్థులతో ముచ్చటించారు. కరీంనగర్‌కు చెందిన పెద్ది ప్రవీణ్, టీం నైజాం డిస్ట్రిబ్యూటర్‌గా వ్యవహరిస్తూ సినిమా విడుదల చేస్తుండగా, యూనిట్ సభ్యులు మాట్లాడుతూ, తమ సినిమా యువతను బాగా ఆకట్టుకునేలా ఉందన్నారు.



మాట్లాడుతున్న చిత్ర యూనిట్ సభ్యులు